పద్యకుసుమావళి

లఘుటీక, విశేషాంశములు, వ్యాకరణము

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్ - 500 001.
ఫోన్: 040 - 24753724

BVP - 2068
8/5/18

2/69

పద్యకుసుమావళి

లఘుటీక, విశేషాంశములు, వ్యాకరణము

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్ - 500 001.
ఫోన్: 040 - 24753724

ప్రథమ ముద్రణ : 1964
28వ ముద్రణ : 2016
ప్రతులు : 6000

వెల రూ. 45/-

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాద్ - 500 001
ఫోన్: 24753724

ముద్రణ:
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
40-ఎపిహెచ్‌బి, విద్యానగర్
హైదరాబాద్ - 500 044
ఫోన్ : 27618261

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణ రెడ్డి
ఎం.ఎ, పిహెచ్‌డి, డి.లిట్
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

అవతారిక

తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం 1943లో ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆరున్నర దశాబ్దాలకు పైగా ఈ రంగాలకు విశేష సేవలందిస్తోంది. బహుముఖీనంగా కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తోంది. తెలుగు భాషావ్యాప్తి నిమిత్తం పరిషత్తు ప్రత్యేక పథకాన్ని రూపొందించింది. గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే అవకాశం లేనివారు తెలుగు చదువుకునేందుకు వీలు కల్గించి ప్రాథమిక, ప్రవేశ, విశారద (పూర్వోత్తర భాగాలు) పరీక్షలు జరుపుతోంది.

పరిషత్తు వయోజన విద్యావ్యాప్తి కోసం శిక్షణ కేంద్రం నిర్వహించి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చింది. గ్రామసీమల్లో వయోజన పాఠశాలలు నడిపి అక్షరాస్యత వ్యాప్తికి దోహదం చేసింది. కార్మికుల కోసం వయోజన పాఠశాలలు నిర్వహించింది. వివిధ సాహిత్య ప్రక్రియల్లో చేపట్టే ప్రచురణలకు అదనంగా పరిషత్తు విద్యావ్యాప్తి నిమిత్తం ప్రత్యేకంగా గ్రంథాలను ప్రచురిస్తోంది.

అంతేకాదు, ఇతర విద్యాసంస్థల అవసరాలకు తగినట్లు తెలుగు పాఠ్య గ్రంథాలను పరిషత్తు రూపొందించి వెలువరిస్తోంది.

పరిషత్తు ఇంతవరకు 135 పైగా గ్రంథాలను ప్రచురించింది. ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ పరీక్షల మండలి జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తుంది.

ఇది కేంద్ర ప్రభుత్వ సంస్థ. ఆంధ్ర సారస్వత పరిషత్తు రూపొందించిన 'పద్య కుసుమావళి' అనే పద్యరచనల సంపుటిని ఈ సంస్థ పదవ తరగతి 'ఐసిఎస్ఇ' పరీక్షకు ద్వితీయభాషా పాఠ్య గ్రంథంగా నిర్ణయించింది. ఇప్పటి వరకు ఒక లక్షకు పైగా ప్రతులు విక్రయమయ్యాయి. విద్యారంగంలో ఈ ప్రచురణ పొందిన అత్యంత జనాదరణకిది నిదర్శనం.

బమ్మెర పోతన, ఏనుగు లక్ష్మణకవి, కూచిమంచి తిమ్మన, గౌరన, నారాయణ కవి, తిక్కన సోమయాజి వంటి అగ్రశ్రేణి కవుల పద్యాలు ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. లఘుటీక, విశేషాంశాలు, వ్యాకరణాంశాలు కూడా పొందుపర్చడం వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది.

28వ ముద్రణగా వెలువడుతున్న ఈ 'పద్యకుసుమావళి' ప్రచురణ యథాపూర్వంగా అందరి ఆదరాభిమానాలు చూరగొంటుందని విశ్వసిస్తున్నాను.

తేది : 25.03.2016

డా. సి. నారాయణ రెడ్డి

ప్రస్తావన

ఇంతవరకు ఆంధ్ర సారస్వత పరిషత్తు 135 కు పైగా రచనలు ప్రచురించింది. అందులో సాహిత్యోపకారకమైన రచనలు, ప్రసంగ వ్యాసాలు, పరిషత్తు పరీక్షలకు ఉపయుక్త గ్రంథాలు ఉన్నాయి. పరిషత్తు ప్రచురణలను తెలుగువారు విశేషంగా ఆదరించారు. ప్రచురణల విభాగాన్ని పటిష్ఠం చేయాలని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణ రెడ్డిగారు సంకల్పించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపన దశ నుంచి ఈనాటి దాకా విద్యావ్యాప్తిని, సాహిత్య సేవను దృష్టిలో పెట్టుకొని ప్రచురణలు చేపడుతున్నది. వయోజన విద్యకూ ఈనాటి అనియత విద్యకూ ఉపకరించే గ్రంథాలు కూడా ప్రచురణల్లో ఉన్నాయి. ఇతర విద్యాసంస్థల పరీక్షలకు సంబంధించిన ప్రచురణల్లో ప్రస్తుత గ్రంథం కూడా ఒకటి. ఇది ఇరవై ఐదవ ప్రచురణ అంటే దీని ప్రాశస్త్యం, ప్రాచుర్యం తెలుస్తాయి. గతంలో నిజాం రాష్ట్రాంధ్రుల నుంచి ప్రవాసాంధ్రుల దాకా సాహిత్యపరమైన అవసరాలు దృష్టిలో పెట్టుకొని పరిషత్తు గ్రంథాలు ప్రచురించింది. అయితే ఈనాటి అవసరాలను గుర్తించి తగిన గ్రంథాలు ప్రచురించే ప్రయత్నం కూడా పరిషత్తు చేస్తున్నది. ఇంతకు ముందులాగే ఈ గ్రంథాన్ని ఆంధ్ర పాఠకలోకం ఆదరిస్తుందని ఆశిస్తాను.

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

విషయసూచిక

1. ప్రార్థన 5
2. సుభాషితాలు 6
3. ఉంగరము 10
4. సత్యనిష్ఠ 13
5. బుద్ధిబలము 17
6. సహకారము 22
7. కపోతోపాఖ్యానము 25

లఘుటీక 28

వ్యాకరణాంశములు 43

—o—

1. ప్రార్థన

ఉ. ఎవ్వనిచేజనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁడనాది మధ్యలయుఁ డెవ్వడు సర్వము దానయైనవాఁ
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబువేడెదన్. 1

క. ఒకపరి జగముల వెలినిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయము గనుచున్
సకలార్థ సాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థి భజింతున్. 2

క. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁదుది నలోకం బగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్. 3

ఆ. ముక్త సంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధు చిత్తు
లసదృశ వ్రతాఢ్యులై కొల్తు రెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు. 4

క. యోగాగ్ని దగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక స
ద్యోగ విభాసితమనముల
బాగుగ నీక్షింతు రట్టి పరము భజింతున్. 5

- బమ్మెర పోతన

2. సుభాషితములు

తే.గీ. బోద్ధలగువారు మత్సర పూర్ణమతులు
ప్రబల గర్వవిదూషితుల్ ప్రభువు లెన్న,
నితర మనుజులబోధోపహతులు, గాన
భావమున జీర్ణమయ్యె సుభాషితంబు. 1

తే.గీ. తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చు
తవిలి మృగతృష్ణలో నీరు ద్రావవచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు. 2

తే.గీ. సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్పు
గౌరవ మొసంగు జనులకు, కలుష మడఁచు,
కీర్తి ప్రకటించు, చిత్తవిస్ఫూర్తిఁ జేయు
సాధుసంగంబు సకలార్థ సాధనంబు. 3

ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందు దాల్మియున్
భూప సభాంతరాళమున బుష్కల వాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమునందనురక్తియు, విద్యయందువాం
ఛాపరివృద్ధియున్, ప్రకృతి జన్యగుణంబులు సజ్జనాళికిన్. 4

తే.గీ. విద్యచే భూషితుండయి వెలయుచున్న
దొడరి వర్జింప నగుజుమీ దుర్జనుండు
చారు మాణిక్య భూషిత శస్త మస్త
కంబు గల పన్నగము భయంకరము గాదె? 5

తే.గీ. అర్కకాంత మచేతనం బయ్యు సవితృ
పాదములు సోకినంతనే ప్రజ్వరిల్లు
గాన నభిమానవంతుఁ డెందైన శత్రు
కృత తిరస్కార మెట్లు సహింపనేర్చు ? 6

కం. విదళింప నుఱుకు సింగపుఁ
గొదమయు మదమలిన గండకుంజరములపై
నిది బలశాలికి నైజము
గద, తేజోనిధికి వయసు కారణమగునే ? 7

కం. దానము భోగము నాశము
పూనికతో మూడుగతులు భువి ధనమునకున్
దానము భోగము నెఱుఁగని
దీనుని ధనమునకు గతి తృతీయమె పొసగున్. 8

తే.గీ. తరువు లతిరసఫలభార గురుతఁ గాంచు
నింగి వ్రేలుచు నమృతంబు నొసఁగు మేఘుఁ
డుద్ధతులు గారు బుధులు సమృద్ధిచేత
జగతి నుపకర్తలకు నిది సహజ గుణము. 9

మ. తమ కార్యంబుఁ బరిత్యజించియుఁ
బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
తమ కార్యంబు ఘటించుచున్ బరహితార్థ
వ్యాపృతుల్ మధ్యముల్

తమకై అన్యహితార్థ ఘాతుక జనుల్
దైత్యుల్ వృథాన్యార్థ భం
గము గావించెడువార లెవ్వరో
యెఱుంగన్ శక్యమే యేరికిన్ ? 10

శా. ఆశాసంహరణంబు నోర్మియు
మదత్యాగంబు, దుర్దోష వాం
ఛాశూన్యత్వము, సత్యమున్,
బుధనుతాచారంబు, సత్సేవయున్,
వైశద్యంబును, శత్రులాలనము,
మాన్య ప్రీతియున్, ప్రశ్రయ
శ్రీశాలిత్వము, దీనులందుఁ గృపయున్,
శిష్టాళికిన్ ధర్మముల్. 11

ఉ. రాతిరి మూషికంబు వివ
రం బొనరించి కరండబద్ధమై
భీతిలి చిక్కి యాసచెడి
పెద్దయు డస్సిన పామువాత సం
పాతముఁ జెందె దానిఁ దిని
పాము దొలంగె బిలంబు త్రోవనే
యేతరి హీన వృద్ధులకు
నెక్కటి దైవము కారణం బగున్. 12

మ. ధర ఖర్వాటుఁ డొకండు సూర్యకర
సంతప్త ప్రధానాంగుఁడై
త్వరతోడన్ బరువెత్తి చేరి నిలిచెన్
దాళ ద్రుమచ్ఛాయఁద

చ్ఛిరమున్ దత్ఫలపాత వేగమున
విచ్చెన్ శబ్దయోగంబుగా !
బోరి దైవోపహతుండు పోవు
కడకున్ బోవుం గదా యాపదల్ ! 13

శా. ఆరంభింపరు నీచమానవులు
విఘ్నా యాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతురు
విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నిహన్యమాను లగుచున్
ధృత్యున్న తోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమా
ప్రజ్ఞానిధుల్ గావునన్. 14

చ. అతనికి వార్ధి కుల్యయగు,
నగ్ని జలంబగు, మేరుశైల మం
చిత శిలలీల నుండు, మదసింహము
జింక తెఱంగుఁ దాల్చుఁగో
పిత ఫణి పూలదండయగు
భీష్మరసంబు సుధా రసంబగున్
క్షితి జనసమ్మతం బగు సుశీల
మదేవ్వనియందు శోభిలున్. 15

- **ఏనుగు లక్ష్మణ కవి**

3. ఉంగరము

గీ. పడఁతి! నీజేని కూరిమిబంట, నతఁడుఁ
దమ్ముఁడును దాను మాల్యవంతమ్మునందు
తమ్మి వలగొని గోఁతి మొత్తమ్ములెల్ల
నోలిఁ గొలువంగ నెమ్మది నున్నవాఁడు. 1

కం. ఓ చాన! యానవాలుగ
నాచే నీ యుంగరంబు నలువుగ నీ కా
రాచూలి పనిచె, నిదిగో !
చూచుకొను మటంచు నెలమిఁ జూపించుటయున్. 2

గీ. డెంద మిగురొత్త నమ్మేలి కుందనంపు
టుంగరము దన మగని చే యుంగరంబు
గా నెఱింగియు, నమ్మక, వానిఁ జూచి
యన్ను తలమానికం బిట్టులనుచుఁ బలికె. 3

గీ. అన్న ! యే ప్రొద్దుఁ డక్కరులగు కడింది
పొలుసు దిండుల చేతి చెట్టలఁ గలంగు
చున్న కతమున నెకిమీని యుంగరంబు
గన్గొనియు లోన నమ్మిక గలుగ దిపుడు. 4

గీ. ఎవ్వడవు నీవు? నీకుఁ బేరెద్ది? యెట్లు
పుడమిజేనికి నీకును బొందు బెర సె?
నద్దొరలరూపు లెట్టి? విందనుచు నపుడు
సామి ననుఁగూర్చి నీతోడ నేమి పలికె? 5

కం. ఏ కరణి కడలి దాఁటితి?
వీ కడ కే పగిదిఁ ద్రోవ యెఱిఁగితి? వెట్లీ
రాకాసుల మొరఁగితి? విఁక
నీ కల తెరఁగెల్ల మాకు నిక్కము చెపుమా ? 6

కం. అనవుడు నతఁ డప్పొలతిం
గనుఁగొని, ఇట్లనుచుఁ దెల్పగడఁగెం దల్లీ !
విను మే జలినట్టు కతం
బున నంజన యనెడు చెలికిఁ బుట్టినవాఁడన్. 7

కం. హనుమంతుఁ డనెడి పేరం
దనరారెడువాఁడ! దొపలదాయ యనుఁగు బి
డ్డనికిం గడు నెయ్యుఁడ నీ
పెనిమిటికిం గూర్చునట్టి బిరుదుమగండన్. 8

కం. ఆ కోఁతులదొర దనుఁ బలు
మూఁకలతోఁ గొలువ నుండి ముద్దియరో! యా
రాకొమరుఁడు నిను వెదకుట
కై కొందఱఁ బంపనేర్చి యనిపెడు నెడలన్. 9

కం. రంగుగ నా చేతికి నీ
యుంగరమిడి నలువువెట్ట, నుప్పొంగుచు ను
ప్పొం గడలి దాఁటి వచ్చి, ని
నుం గాంచితి నిచట వేడ్క నూల్కొనఁ బడఁతీ! 10

కం. బల్లిదపుఁ గోఁతిమూఁకలు
పెల్లుగఁ దమఁగొల్వ నీదు పెనిమిటి యిదిగో!
నెల్లిట నేఁటనో యిచటికి
తల్లీ ! యరుదెంచు నింకఁ దలఁకకు మదిలో. 11

గీ. ఎఱచి ఎరదిండి మన్నియ యిపుడు వచ్చి
నిన్నుఁ గఱకులు పలుకుచు నున్న యెడల
చాన! యీ చెట్టుపై నుండి వాని దునుమ
తలఁచి మరలితి నీకుఁ గీ డెలయు నంచు. 12

ఉ. కల్లరిరక్కసుండు నినుఁ
గైకొని వచ్చినగోలె, బల్లిదం
బెల్లను దూలి, పూఁట యొక
యేఁడుగఁ ద్రోయుచు నబ్బురంపు బల్
తల్లడ మూని తిండియును
దప్పియు నిద్దుర యుం దొఱంగి తేఁ
డుల్లము దద్ద నీ పయినె
యుంచి కలంగుజూమీ పొలంతుకా!

“తడవు లేదిదె దండుతోఁ దరలి వచ్చి
కడలి వడి దాఁటి రక్కసు నడఁచి నిన్ను
మరలఁగైకొందు నుమ్మలింపకు” మటంచు
తెలుపుమనీ పల్కె నతఁడు గ్రొందలిరుబోడి !

- కూచిమంచి తిమ్మన

4. సత్యనిష్ఠ

ద్విపద॥ తలఁదింపుమని తెంపు దలకోనఁ బలికి
జలజాక్షి తన చీర చక్క నమర్చి
ప్రాణేశు వలగొని పదముల కెరగి
పాణివల్లవములు భక్తితో మొగిచి 1

యనుదిన రక్త పంకారుణం బగుచుఁ
గనుపట్టి జేవురుగట్టు చందమున
నున్న యా వధ్య శిలోపరిస్థలిని
జెన్నారి చిఱునవ్వు సెలవిఁ దళుకొత్తఁ 2

బద్మాసనంబున బడఁతి గూర్చుండి
పద్మినీ వల్లభుపైఁ జూడ్కి నిలిపి
"లోకలోచన! సర్వలోకైక వంద్య !
నాకు వేవేల జన్మంబుల యందు. 3

సతతపుణ్యుని హరిశ్చంద్రభూవిభుని
బతిగా నొనర్పుమీ! పార్థివేశ్వరుని
యాపద లన్నియు నడఁచి సత్యంబు
దీపింపఁజేయు మీ తెఱఁగున" ననుచు 4

వినయంబు నెక్కొన వేఁడి చిత్తంబు
తన పతిపైఁ జేర్చి, తలఁపొండు లేక
యున్నంత బంధంబు లూడ్చి పోవైచి
యన్నరేంద్రుఁడు జగదాశ్చర్య మొసఁగ 5

శాత ధారాభీల చటుల ఖడ్గంబు
భూతముల్ భీతిల్ల ముష్టి నమర్చి
జళిపించి జీవికేశ్వరి మెడ మోపి
కలఁగక తెగవేయ గమకించునంత 6

గ్రమ్మఱ నెడసొచ్చి ఖడ్గంబుఁ బట్టి
యమ్మనుజేశుతో ననియెఁ గౌశికుడు
"చాలు నోహో! యిట్టి సాహస కృత్య
మేల కైకొంటి నరేశ్వర! నిన్ను 7

వీక్షింప దోషంబు వివరింప మనుజ
రాక్షసుండవు గాక రాజువా నీవు ?
క్రమమున ధర్మార్థ కామ మోక్షములు
నమర నీకీఁ దగునట్టి యీ సాధ్వి 8

జననుత సౌందర్య సంశోభితాంగి
నినుపముల్కికి నేల యీఁ దలంచెదవు?
భువన విఖ్యాతమై పొలుపొందునట్టి
రవి వంశమునఁ బుట్టి రాజసం బుడిగి 9

బతిమాలి పెనుమాల బందివై నీరు
గతిఁగాడు గాచు నీ కష్టంబు దగునె
కులపతి తలఁ దెగఁగొట్టి యే లోక
ముల కేగి సౌఖ్యంబు పొందఁ జూచెదవా. 10

యాలికై దక్షుని నడఁపఁడే శివుఁడు
పోలింప నీ కంటె బుద్ధిహీనుండె ?
సతిలేని గృహమేల? సౌఖ్యంబులేల ?
సతిలేని సుతులేల ? సంపదలేల ? 11

సతియుఁ గల్గినఁ గల్గు సకల ధర్మములు
సతియుఁ గల్గినఁ గల్గు సకల పుణ్యములు
అటుగాన విడువు మీ యాగ్రహబుద్ధిఁ
గట గటా! నీ వివేకం బెందుఁబోయె 12

నామాటఁ గైకొని నా కుమారితల
నా మాలమగువల నర్థి వరింపు
నీ సుతు ప్రాణంబు నీ రాజ్య సుఖము
నీ సతితో - బొందు నీ తొంటి పెంపుఁ 13

బడయు మీ వింక నీ పదును దప్పినను
గడపట నీవు తెక్కలి జత్తువనుచుఁ
బెక్కు చందంబులఁ బ్రియమును భయము
నెక్కబోధింప మునీంద్రునిఁ జూచి 14

పకపక నవ్వి యీ భవసాగరంబు
నొకదరిఁజేర్పుచు నున్నాఁడు శివుఁడె
మును నీవు చెప్పిన బుద్ధులే కాక
వినఁ గ్రొత్తలే యివి వివరించి చూడ 15

సుతునొల్లసతినొల్ల సురలోక మొల్ల
బతిమాలి నీవిచ్చు పడఁతుల నొల్ల
సత్యంబుఁ గలిగిన జాలు వే యేల?
సత్యమే జయమని చాటు వేదములు 16

విడువు ఖడ్గం బింక వేంచేయు మిట్టి
యెడ నుండఁ జనదు మునీశ! నీవింక
నావుడు వెఱఁ గంది సురలోక నాథు
పావన సత్య సంపద కాత్మనలరి 17

బొంకించు నాసలఁ బోవీడి మౌని
పొంకంబు చెడి తలపోయుచు నుండె
నప్పుడు దేవత లంబర వీథి
నుప్పొంగు వేడ్కల నువిదలుఁ దారు 18

బహు రత్న దీప్తుల భాసిలుచున్న
మహనీయ దివ్య విమానంబు లెక్కి,
వెఱగంది క్రందుగా వీక్షించుచుండ
నెస దెంపుమై ధారుణీతలేశ్వరుఁడు 19

భిదురంబు కంటెను బెడిదమై చదల
నదరులు సెదర భయంకర లీల
వాలువాలెత్తి యా వామాక్షి కంఠ
నాళంబు తెగవేయ నది చుఱుక్కనఁగఁ 20

దాకిఁన వ్రేటు పూదండయై చెన్నుఁ
గైకొని పూఁబోడి గళమున నుండె. 21

- గౌరన

5. బుద్ధిబలము

ఉ. ఉగ్రవనంబులోన హరి,
యొక్క యెడన్ వసియించి సర్వ స
త్త్వ గ్రహణార్థియై బహువి
ధంబుల మాంసము దిన్చునుండ ద
ద్వ్యగ్రత జూచి జంతు తతుఁ
లన్నియు గూడి మృగేంద్రు పాద ప
ద్మాగ్రములం దలల్ గదియ
నార్తి మెయిం బ్రణమిల్లి యిట్లనున్. 1

సీ. అవధరింపు మృగేంద్ర! యడవి జంతు సమూహ
మిదె విన్నపంబున నేగుదెంచె
నెట్లన్న నన్నింటి నెసరేగి యొక్కట
జలపట్టి యొకనాట జంపనేల ?
నిత్యమొక్క మృగంబు నీకు గట్టడ గాగ
బ్రీతి నాహారంబు పెట్టగలము
సమ్మతింపు మనిన సకల జంతువులకు
నట్ల కానిమ్మని యభయ మొసఁగి

3. యనుప నవి వోయి నిత్యకృత్యంబు గాగ
నుదయ మయ్యెడికొలదికి నొకటిఁబంప
నది భుజించి హర్యక్షము ముదము బొందు
నీ విధమ్మున జిరకాల మేగునంత. 2

కం. పులికోలుకాడు గావున
నలయక వరు సెరిగి వాని ననుపగ నొక నా
డొలసి యొక చెవులపోతుకు
గలయక నిలువరుస యనుచు గ్రక్కున జెప్పెన్. 3

ఆ. పలుకు విన్న మాత్ర బ్రాణంబు చలియింప
శశక మపుడు మూర్ఛః జాల దూలి
తెలిసి కన్ను దెఱచి, దృష్టించి తల యూచి
దిగులు పుట్టి యాత్మ పగుల నొగిలి. 4

వ. ఆ శశకంబు ముహూర్తమాత్రంబు చింతించి తెలివొంది
డెందంబు కొందలం బుడిపికొని వృద్ధుండయ్యును
సాహసంబు దెచ్చుకొని తనలో నిట్లని వితర్కించె. 5

కం. బుద్ధి నశక్యమ్మగు పని
యిద్ధాత్రిం గాన గలదె యిది గెలిచెద నా
బుద్ధిబలంబున సింహము
నుద్ధతి యణగించి ప్రాణయుక్తికి బాయన్. 6

కం. అనుచు దలపోసి యా శశ
మనుమానింపుచును గదలునప్పటికి నినుం
డు నభోమధ్యగతుం డగు
డు నతి క్షుత్పీడచేః గడుం గ్రోధమునన్. 7

తే. అవుడు గఱచి కంఠీరవం బౌర! యిప్వ
నమున మృగములు నేడు గర్వమున నేచి
దినదినంబును నాకు బుత్తెంచు మృగము
ననుప రిది యెమొకో యను నవసరమున. 8

కం. అధుగులు తొట్రుపడంగా
నడలొందిన యదియ పోలె నయ్యైయెడలన్
బుడమి బడి మ్రొగ్గి లేచుచు
గడసరి యాశశక మొయ్య గదియం బోవన్. 9

కం. అప్పుడు చూచి మృగేంద్రుడు
నిప్పులు కనుదోయినుండి నెరయగ నోరీ!
చొప్పడడు వేళ దప్పిన
యప్పటి యశనంబు నాకు నహితం బగుచున్. 10

కం. అపరాహ్ణ వేళధాకం
గపటంబున నిట్లు రాని కారణ మేమీ ?
విపరీతంబులు పుట్టెనొ
విపినంబున నున్న జంతువితతకి నెల్లన్. 11

చ. అని యివ్విధంబున రోషావేశంబున బలుకుచున్న
మృగేంద్రునకు సాష్టాంగ దండప్రణామంబులు చేసి
శశకం బిట్లనియె. 12

చం. కినియక చిత్తగింపు మొక
కీడును నాదెస లేదు నేడు సూ
ర్యుని యుదయంబువేళ నను
నొక్క మృగేంద్రుడు వచ్చి యడ్డగిం
చిన నిది యేల యేలిక భు
జింపగ బోయెడి నన్ను బోవని
మ్మనిన వనంబు జంతు నివ
హంబుల కేలిక నేను కానొకో! 13

వ. అనుచు బెద్దయుం బ్రొద్దతండు నన్ను దేవరసమ్ముఖంబు
నకు రానీక నిలిపి మరియు నిట్లనియె. 14

కం. నాకంటె నధికు డెవ్వడు
నా కతనిం దెచ్చి చూపినన్ నిను మెత్తున్
లేకున్న నిన్ను ద్రుంతున్
గా కని యత డప్పు డనుపగా భీతిమెయిన్. 15

కం. అ విధ మెఱిగించుటకై
దేవర యున్నెడకు బాఱుదెంచితి నీకుం
దేవలసినట్టి మృగమును
రా విడువం డనిన నతడు రభసం బెసగన్. 16

కం. ఏ వంక నుండు నా హరి
యే వేళకు నాకు జిక్కు నే నే భంగిన్
భావింప యతని గదియుదు
నావుడు నాతనికి శశకనాథుం డనియెన్. 17

కం. సింగం బాకలి గొని సా
రంగాది మృగాళివెనుక రయమునజను నీ
వంగీకరించి కదలుము
వెంగలి మృగరాజు బట్ట వెఱ పేమిటికిన్? 18

కం. అను పలుకు విన్న మాత్రన
తన మది గ్రోధానలంబు దరికొన్న శశకం
బున కనియెనోరి! ముందఱ
వనమున వాడున్న దెసకు వడిజను మనుచున్. 19

వ. మృగేంద్రము శశకంబు వెంట జని, 20

గీ. ఆత్మదేహంబు కూప జలాంతరమునఁ
గాంచి వేఱొక సింహంబుగాఁ దలంచి
కన్ను గానక మౌర్ఖ్యంబుకతన నుఱికి
యపుడె మృతిఁ బొందె దుర్బుద్ధి యగుటఁజేసి. 21

- నారాయణ కవి

6. సహకారము

గీ. అడవిలో నొక మఱ్ఱియడుగున లాఁగల
బలితుండు నా నొక్క యెలుకయుండు
నమ్మహీజముమీఁద ననిశంబు రోమశుం
డను పిల్లి వసియించు న్నా సమీప
మున సంజకడ నిత్యమును మృగంబుల కురు
లొడ్డి, వేకువ వచ్చి, యొక్క మాలఁ
డగపడ్డవానిఁ గొంచరుగ ; నొక్కప్పుడా
హారంబునకుఁ బిల్లి యచటఁ దిరుగ

గీ. బోయ యురిఁబడియుండగఁ బొంచి చూచి
భయము దక్కి, యచ్చోట నప్పలితుఁడెరకు
గ్రుమ్మఱఁగఁ జంద్రకుండను గూబపులుఁగు
హరిక యనియెడు ముంగియు నంతఁదోచె. 1

వ. ఆ యెలుక యా రెంటిబారికిఁ దప్పిపోవ రామిఁదలంచి
ధైర్యంబు కలిమిం గార్యంబు నూహించి యప్పిల్లినిఁ
జేరం జని దానితో నిట్లనియె. 2

కం. ఉరి ద్రెవ్వఁ గొట్టికి యిప్పుడు
వెరవారఁగ నేను నీకు విడుగర సేయన్
దొరకొనుట నీదు భాగ్యం
బరిత్వము దొఱంగి మైత్రి యలవఱపు మదిన్. 3

కం. ముంగికి గూబకు నగపడి
యంగంబులు వణఁకుచున్న యవి నా, కీమై
సంగతి కలిగిన నీ యు
త్సంగంబున నుండి భయము దక్కుదు నేనున్. 4

చం. అనవుడుఁబిల్లి యిట్లనియె
నార్తశరణ్యుఁడ వయ్యె దిట్టి ని
న్ననఘ! హితంబు సేయవల
దయ్య? జగత్పతిసాక్షిగాఁగ, ని
ప్పని తగఁ బూనితి న్వెఱపు
వాసి నను౦ గదియంగ రమ్ము, వ
చ్చిన నకులంబు గూబయును
జేరఁగ నేరవు నాకు నోడుటన్. 5

కం. అని పలుక, పిల్లి దగ్గఱి
యనయము నిశ్శంకవృత్తి నయ్యెలుక వసిం
చినఁ జూచి యయ్యులూకం
బును నకులము నచటవాసి పోయె నిజేచ్ఛన్. 6

కం. నకులోలూకంబుల పో
కకు సంతస మందియుండి, గ్రక్కున నమ్మూ
షిక మయ్యురిచేరులు గొఱు
కక యలసత నల్లనల్లఁ గఱచుచు నుండెన్. 7

వ. అది యెఱింగి లోమశుఁడిట్లనియె. 8

కం. తగునేయిట్లు కృతార్థుడ
వగు నీ కురి కొఱక కిట్టు లాలస్యము సేఁ
దగుట? కృతఘ్నతకును నెల
వగు టొప్పునె? కొఱకు కడఁక నద్రోహుడవై. 9

చం. అనుటయు నెల్క యిట్టులను
నాశ్రితరక్షణ శీలు నిన్నుఁ గీ
డును బొరయంగ నిత్తునె! క.
డుం జెడుగుందన మేను భీతి నూ
నిన మతితోడ నమ్మమిన[1] నెట్లన
యియ్యురిఁ ద్రెంప నీ యెడన్
మనమున నెగ్గుగాఁ గొనక
మాలని గాంచినయప్డె త్రెంచెదన్. 10

వ. అని యిట్లు మాటలాడ వేకువ యయ్యె అట్టియెడ. 11

కం. తనతోఁ గొందరు గుక్కలు
గొని యేతెరంగఁ గేలఁ గ్రూర కృపాణం
బునః భీకరభంగిగ వెసఁ
జనుదెంచె భీకరభంగిగ వెసఁ
ఒనుదెంచె న్మాల డధిక సంరంభమునన్. 12

కం. కనివాని "యోడ కోడకు"
మనుచుం దెగఁగొఱికె వేగమయ్యురిఁ బలితుం
డనయము చకితాత్ముం డయి
చనియెన్ రోమశుఁడు నవనిజముపైకి వెసన్. 13

1. నమ్మనిఁక

- తిక్కన సోమయాజి

7. కపోతోపాఖ్యానము

సీ. పాపాత్ముఁడొక బోయ పక్షుల వధియించి
తినియును బెక్కమ్మి కొనియు, నదియ
బ్రతుకుగా దానికి బహుసాధనంబులు
సవరించుకొని మహాటవిఁ జరింప
నొకనాఁడు పెనువానయున్మ గాలియును ముట్టి
సకల జీవులకు నాశంబు పుట్టు
నట్టిదియై కాన యంతయు జలమయం
బైన బెగ్గిలి యస్న రాధముండు

గీ. వేగ వట్టోడి యెల్లను వెదకి మిఱుత
నొక వనస్పతి జొంపమై యున్న దానిఁ
జెంది, రాతిరి యగుటయు, శిలయ సెజ్జ
గాఁగ శీతార్తుఁడై యుండె గౌరవేంద్ర! 1

గీ. వేటకాఁ డటు శయ్య ప్రాపించి యుండ
నమ్మహీరుహ కోటరమందు నున్న
పావురముఁ మేతకై చన్న పడఁతి రాక
తడయుటను జేసి కడుఁ బరితాపమంధ. 2

వ. బోయవలలో నున్న కపోతి విని, మనంబున పరితపించి. 3

కం. పతిమదికి నింత యెక్కిన
యతివ గదా పుణ్యవతి, ప్రియాలాపము లీ
గతి వినఁగాంచిన జన్మము
కృతకృత్యంబయ్యె నాకు ; గెలిచితి జమునిన్. 4

వ. అని చింతించి, పతికిం దన తెఱం గెఱింగించి "విధి
కృతంబునకు వగవం బనిలే"దని మఱియునిట్లనియె. 5

చం. శరణము సొచ్చినం దగుఁ బ్ర
సన్నతఁ గైకొని రక్షణంబు సా
దరముగఁ జేయు టత్యధిక
ధర్మముగా బుధకోటి సెప్పు : నీ
వరసి మహార్తు వీని, శర
ణాగతు నోపినభంగి నాపదం
బొరయక యుండఁ జేయుము,
ప్రభూతపు సీతునఁ గొంకువోయెడున్. 6

వ. అన్నంత నా విహగము శోకము మాని యా లుబ్ధకునితో
నిట్లనియె. 7

కం. ఓ యన్న ! డస్సినాఁడవు ;
మా యింటికి నతిథి వైతి ; మసలక నీకుం
జేయవలయు నాతిథ్యం
బేయది భవదీప్సితార్థ మెఱిగింపు మనన్. 8

వ. అనవుడు పక్షివైరి మనంబు సంతసంబున నుప్పొంగ నా
కపోతంబుతో "సీతున నయ్యెడు సకలాంగముల బాధ
నివ రింపఁజేయవే" యన నదియు. 9

గీ. పుల్లలను బ్రోగుచేసి, యా పొంత నున్న
పల్లె నింగలంబును దెచ్చి పరమప్రీతి,
దాని రగులుజేయఁగ, బోయ దానితోడఁ
దనదు నంగములను గాచికొనిన పిదప. 10

వ. ఆఁకలి చాలఁ దోఁచిన గువ్వ కది యెఱింగింపనది, 11

కం. "కొను మిదె యాహారం" బని
తన దేహం బింగలమునఁ దడయక తోఁఱగం
గని, బోయ వింత నొందుచు
మనమున వైరాగ్య మూని మానిత శాంతిన్. 12

కం. వలలోన నున్న పులుఁగుల
వెలువడగా విడిచి, వలయు వెండియుఁ దనకుం
గల పక్షినిహతి సాధన
ములు నచటనె యుండఁబోయె బోయ నియతుడై 13

వ. అక్కపోతి నాఁడగ్నిలోఁ బడుటకుఁ జిత్త మాకుల
ముగ నిట్లని విలపించె. 14

కం. "ఈని యను మరణమునఁ దన
మేను విడిచినట్టి కాంత, మేలి పదవికిం
దాను నతండును నరిగి, య
నూన స్థిరసుఖము లందుచుండుట విందున్." 15

వ. అని పలికి, యపుడా యనలము సొచ్చి భర్త గూడం జనియె.

- తిక్కన సోమయాజి

లఘుటీక

1. ప్రార్థన

ఈ పాఠ్యభాగము బమ్మెర పోతన రచించిన ఆంధ్ర మహాభాగవతము నందలి గజేంద్రమోక్ష కథా ఘట్టము నుండి గ్రహింపఁ బడినది.

బమ్మెర పోతన సంస్కృత భాగవతము నాంధ్రీకరించెను. ఇతని నివాసము ఓరుగల్లు మండలమందలి బమ్మెర ప్రాంతము. ఇతఁడు క్రీ.శ. పదునైదవ శతాబ్దపు చివరిభాగమున నుండెను. సహజ పాండిత్య విరాజితుఁడనని చెప్పుకొన్నాడు. దరిద్రుఁడయ్యును తన భాగవతమును నరాంకితము సేయనొల్లక శ్రీరామచంద్రున కర్పించిన మహాభక్తుడు, ఇతని కవిత్వము శబ్దాలంకార యుక్తమై మృదుమధుర పద గుంఫితమై భక్తిరస ప్రధానమై పాఠకులకు చవులూరించును. ఇతఁడు భోగినీ దండకము, నారాయణ శతకము, వీరభద్ర విజయమును వ్రాసెనని కొందఱు పండితులనెదరు.

జనించు=పుట్టును, జగము = ప్రపంచము, లీనమై = ఐక్యమై, డిందున్= అడఁగును, మూలకారణంబు = ప్రధానకారణము, ఆది+మధ్య+లయుఁడు= మొదట నడుమ చివర ఐనవాఁడు, తానె = తానె, ఆత్మభవున్ = మనసులోఁ బుట్టినవానిని, ఈశ్వరున్ = భగవంతుని, శరణంబు = రక్షణము.

వెలినిడి = బయట ఉంచి, ఉభయమున్ = లోకముయొక్క బయట వ్యాపించుట, లోపల నణఁగుట అను రెండు స్థితులను; సకల + అర్థ + సాక్షి= అన్ని విషయములను పొందక సాక్షిగా ఉండు వాఁడు, అకలంకున్ = దోషములులేని వానిని, ఆత్మమూలున్= జీవాత్మని ప్రధాన కారణమైనవానిని, ఆర్థిన్ = కోరికతో, భజింతున్ = సేవించెదను.

లోకంబులు = భూలోకము మొదలైనవి, లోకేశులు = లోకములకు అధిపతులైనవారు, లోకస్థులు = లోకములో నుండు జనులు, తెగినన్ = నశింపఁగా, తుదిన్ = కడపట, అలోకంబు = కనరాని, పెంజీకటటికిన్ = గొప్ప చీకటికి, అవ్వలన్= అవతల, ఏక + ఆకృతిన్ = ఒకటే రూపములో, వెలుగున్ = ప్రకాశించునో, అతనిన్ = ఆ తేజోమూర్తిని.

ముక్త + సంగులు = విడువఁబడిన సంసారము గలవారు, దిదృక్షులు= చూడవలెనను కోరికగలవారు, సర్వ + భూత + హితులు = అన్ని జీవులకు మేలుఁగోరువారు, సాధు + చిత్తులు = మంచి మనస్సుగలవారు, అసదృశ + వ్రత + ఆఢ్యులు = సాటిలేని నియమములు గలవారు, ఎవ్వని దివ్యపదము = ఏ దేవుని మహిమగల పాదమును, కొల్తురు = సేవింతురో.

యోగ + అగ్ని + దగ్ధ + కర్ములు = యోగము అను అగ్నిచే కాల్పఁబడిన కర్మలు గలవారు (యోగనిష్ఠతో ఉండి ఇతర కర్మములను చేయనివారు), యోగి + ఈశ్వరులు = యోగులలో గొప్పవారు, ఒండు = ఇతరమును, సత్ + యోగ + విభాసిత + మనమునన్ = మంచి యోగములు చేత వెలుఁగునట్టి మనస్సులతో, ఏ మహాత్మున్ = ఏ గొప్పవానిని, వీక్షింతురు = చూచెదరో, పరమున్ = భగవంతుని.

2. సుభాషితములు

ఈ పాఠము బర్తృహరి సుభాషితము నందలి నీతి శతకములోనిది. ఇది సంస్కృత సుభాషితమునకు ఏనుగు లక్ష్మణ కవి చేసిన ఆంధ్రానువాదము ఇందు నీతి శృంగార, వైరాగ్య శతకములు కలవు. ఇతని శైలి సుందరమైనది, సులభమైనది. ఈ మహాకవి 1750 ప్రాంతమున నుండెను. ఈతని గ్రంథములు సుభాషిత రత్నావళి, రామవిలాసము, రామేశ్వర మహాత్మ్యము మొదలైనవి.

బోద్ధలు=తెలిసినవారు, మత్సర + పూర్ణ + మతులు = అసూయచే నిండిన బుద్ధికలవారు, ప్రభువులు = రాజులు, ప్రబల + గర్వ + విదూషితుల్= చాలా గర్వముతో కూడినవారు, ఎన్నన్ = విచారింపగా, అబోధ + ఉపహతులు= అజ్ఞానముచే కొట్టఁబడినవారు, భావమున = మనసులో, సుభాషితము = మంచిమాట.

తివిరి = ప్రయత్నము చేసి, ఇసుమున = ఇసుకలో, తైలమున్ = నూనెను, తవిలి = వెంటబడి, మృగతృష్ణ = ఎండమావులు, రంజింపరాదు = సంతోష పెట్టలేము.

సత్యసూక్తి = సత్యమును పలుకునట్లు, ఘటించు = కలిగించును. ధీజడిమ = తెలివితక్కువతనమును, కలుషము = పాపము, చిత్తవిస్ఫూర్తిన్ = మనస్సునకు వికాసమును, సాధుసంగంబు = మంచివారి స్నేహము, సకల + అర్థసాధకమ్ము = అన్నికోర్కెలు నెరవేర్చునట్టిది.

ఆపదలందు = కష్టములు వచ్చినపుడు, అంచిత సంపదలు = ఒప్పిన ధనము మొదలైనవి, తాల్మి = ఓరుపు, భూపసభ + అంతరాళమున = రాజుల సభలలో, పుష్కల+వాక్ చతురత్వము = విశేషముగా మాటల నేర్పు, ఆజి = యుద్ధములందు, బాహా+పటు+శక్తి = భుజములలో గొప్ప బలము, యశము= కీర్తి, అనురక్తి = ప్రేమ, వాంఛాపరివృద్ధి = అన్ని విధముల పెరిగిన కోరిక, ప్రకృతి జన్య = పుట్టుకతో (స్వభావము) ఏర్పడినది, సజనాళికిన్ = మంచివారికి.

భూషితుఁడు = అలంకరించఁబడినవాఁడు, వెలయుచున్నన్ = ఒప్పుచున్నప్పటికిని, తొడరి = పూని, వర్ణింపనగు = విడువవలెను, దుర్జనుండు= చెడ్డవాఁడు. చారు+మాణిక్య+భూషిత+శస్త+మస్తకంబు = సొగసైన మణిచేత అలంకరింపఁబడిన శ్రేష్ఠమైన తల, పన్నగము = పాము. (వ్యు : పాదములచే నడువనిది = పామునకు కాళ్ళుండవు) 5

అర్కకాంతము = సూర్యకాంతపురాయి, అచేతనము = జీవశక్తి లేనిది. సవితృపాదములు = సూర్యుని పాదములు (కిరణములు). ప్రజ్వరిల్లు = కోపముచే మండును. (బాగుగ వెలుగును), శత్రు+కృత+తిరస్కారము = పగవాఁడు చేసిన అవమానము.

విదళింపన్ = చీల్చుటకు, కొదమ = పిల్ల, మద + మలిన + గండ + కుంజరములపై= మదపునీటిచే మురికి అయిన చెక్కిళ్ళుగల ఏనుఁగుల మీఁద, నైజము = పుట్టుకతో వచ్చిన గుణము, తేజోనిధికి = పరాక్రమము కలవానికి. 7

భోగము = అనుభవించుట, భువి = లోకమునందు 8

తరువులు = చెట్లు, అతి+రస+ఫల+భార+గురుతన్ = ఎక్కువ రసముగల పండ్ల బరువు యొక్క గొప్పదనమును, కాంచు = పొందును, నింగిన్ = ఆకాశమునందు, అమృతంబున్ = నీటిని, ఉద్ధతులు = గర్వము గలవారు, బుధులు= తెలిసినవారు, సమృద్ధి = గొప్ప సంపద, ఉపకర్తలు = మేలు చేయువారు, సహజ = పుట్టుకతో వచ్చిన. 9

కార్యమున్ = పనిని, పరిత్యజించియున్ = వదలుకొనియైన, వర+అర్థ+ప్రాపకుల్= ఇతరులకు ప్రయోజనము కలిగించువారు, సజ్జనుల్ = మంచివారు, ఘటించుచున్= సాధించుకొనుచు, పరహిత + అర్థ + వ్యాపృతుల్= ఇతరులకు మేలుకలుగు ప్రయోజనమునకై పాటుపడువారు, అన్య + హిత + అర్థఘాతుక + జనుల్ = ఇతరులకు మేలైన ప్రయోజనమును చెడగొట్టువారు, దైత్యుల్ = రాక్షసులు (వ్యు: దితి కొడుకులు) వృథా + అన్య + అర్థ + భంగము= తనకు ప్రయోజనము లేకుండ ఇతరుల ప్రయోజనమును పాడుచేయుట, శక్యమే + సాధ్యమా, ఏరికిన్ = ఎవరికైనా. 10

ఆశా + సంహరణము = ఆశను చంపుకొనుట, ఓర్మి = ఓరుపు, మద + త్యాగంబు = పొగరును విడుచుట, దుర్దోష + వాంఛా + శూన్యత్వము= చెడుపు చేయుటయందు కోరికలేకుండుట, బుధ + మత + ఆచారంబు = పెద్దలకు ఇష్టమైన నడవడిక, సత్ + సేవ = ఉత్తములను కొలుచుట, వైశద్యంబు= కపటము లేకుండుట, శత్రు + లాలనము = పగవారిని ప్రేమించుట, మాన్య+ ప్రీతి = పూజ్యులయందు ప్రేమ, ప్రశ్రయ + శ్రీ + శాలిత్వము = వినయ సంపదచే ప్రకాశించుట, దీనులు = దిక్కులేనివారు, కృప = దయ, శిష్ట + ఆళికిన్ = పెద్దలసమూహమునకు, ధర్మముల్ = చేయఁదగినవి. 11

మూషికము = ఎలుక, వివరంబు = బొక్క, కరండ + బద్ధమై = పెట్టెలో బంధింపబడినట్టిదై, డస్సిన = అలసిన, వాతన్ = నోటితో, సంపాతము= పడుట, తొలగెన్ = పోయెను. బిలంబు = రంధ్రము, ఏతఱిన్ = ఎప్పుడైనను, హానివృద్ధులకు= మేలు కీళ్ళకు, ఎక్కడి = ఒక్క. 12

ఖర్వాటుఁడు = బట్టతలవాఁడు, సూర్యకర సంతప్త ప్రధానాంగుఁడు = ఎండచే కాలిన తలగలవాఁడు, తాళ ద్రుమచ్ఛాయ = తాటిచెట్టునీడ, దైవోపహతుండు = అదృష్టహీనుడు. 13

ప్రారబ్ధార్థములు = ఆరంభించిన కార్యములు; ఉజ్జగింపరు = వదలరు. 14

వార్ధి = సముద్రము, కుల్య = కాలువ, ఫణి = పాము. 15

3. ఉంగరము

ఈ పాఠము కూచిమంచి తిమ్మకవి రచించిన "అచ్చతెనుఁగు రామాయణము" నందలి సుందర కాండము లోనిది. అశోక వనము నందున సీతాదేవిని చూచి ఆంజనేయుఁడు శ్రీరాముని ఉంగరమును సమర్పించు ఘట్టము. ఈ రామాయణము అచ్చ తెలుఁగులో వ్రాయఁబడినది.

తిమ్మకవి పిఠాపురము దగ్గర ఉన్న కందరాడ గ్రామకరణము. ఇతడు 18వ శతాబ్దము నందుండిన పిఠాపుర మహారాజగు చిన మాధవరావు వలన కవి సార్వభౌమ బిరుదము నందినాఁడు పిఠాపుర కుక్కుటేశ్వరస్వామి భక్తుఁడై తన గ్రంథములన్నియు నా దేవునికే అంకితమిచ్చిన స్వతంత్రుఁడు. ఈయన కవిత్వము రసవంతము, లలితము. ఇతని రచనలలో అచ్చ తెనుఁగు రామాయణము, రసికజన మనోభిరామము, రాజశేఖర విలాసము, సర్పపురీ మహాత్మ్యము, సర్వ లక్షణ సార సంగ్రహము, రుక్మిణీ పరిణయము, కుక్కుటేశ్వర శతకము ప్రసిద్ధములు.

వలగొని = ప్రదక్షిణము చేసి, కోఁతి మొత్తములు = కోఁతుల గుంపులు.

చాన = స్త్రీ, ఆనవాలుగ = గుర్తుగా, నలువుగ = ఒప్పిదముగ, రాచూలి= రాజకుమారుఁడుఁ (శ్రీరాముడు).

డెందము = మనస్సు, ఇగురొత్త = సంతోషింప, కుందన = బంగారు, అన్నులమానికంబు = స్త్రీలలో శిరోమణి అయిన సీత.

కడిఁది పొలసుదిండులు = క్రూరులైన రాక్షసులు, చెట్టలన్ = కీడులచేత, కలంగు= బాధపడు, కతమున = కారణమున, ఎకిమీని = యజమానుని యొక్క. 4

పొందు = స్నేహము, బెరసె = కలిగెను, అనుపు = పంపు 5

కడలిన్ = సముద్రమున, మొఱఁగితివి = మోసగించితివి, తెఱఁగు = ఉన్న సంగతి, నిక్కము = నిజము. 6

అనవుడు = అని అడుగఁగా, చలినట్టు = వాయుదేవుని.

తొవలదాయ = కలువలకు పగవాఁడు (సూర్యుడు), బిరుదుమగండన్= శూరుడను, నెయ్యుఁడ = స్నేహితుఁడను, కూర్చునట్టి = ఇష్టమైనట్టి. 8

మూఁకలతోన్ = సైన్యములతో. 9

సెలవుపెట్ట = ఆజ్ఞ ఇయ్యగా, నూల్కొన = ఎక్కువకాఁగా 10

పెల్లుగ = గొప్పగా, ఎల్లిట = రేపో, నేటనో = ఈ దినమో, తలఁకకు = భయపడకుము, బలముగల. 11

ఎఱచి యొరదిండి మన్నియ = మాంసము దినువారల (రాక్షసుల) రాజు (రావణుఁడు), కఱకులు = కఠినపు మాటలు. 12

వచ్చినగోలె = వచ్చినప్పటినుండి, కల్లరి = టక్కరి, తూలి = పోగొట్టుకొని తద్ద= ఎక్కువగా. 13

ఉమ్మలింపకుము = దుఃఖింపకుము, క్రొందలిరుఁబోడి = క్రొత్త చిగురాకు వంటి సౌందర్యముగల సీతాదేవి.

(వ్యు) హనూమంతుడు = హనుమ (వెలిదౌడ) గలవాడు.

వూడయొక్క యేఁడుగ (జాతీయము)

అచ్చ తనుఁగులో తత్సమ పదములుండవు. 14

4. సత్యనిష్ఠ

ఈ పాఠము గౌరన ద్విపద హరిశ్చంద్రోపాఖ్యానములోనిది. గౌరన 15వ శతాబ్ది పూర్వభాగమున రాచకొండ రాజ్యములో ఉండిన నియోగి బ్రాహ్మణుఁడు. ఇతని శైలి మృదువైన జాతీయోక్తులతో సామెతలతో నిండి చాలా సరసముగా నుండును, ఇతఁడు నవనాథ చరిత్రము, హరిశ్చంద్రోపాఖ్యానము అను ద్విపద కావ్యములను, సంస్కృతభాషలో "లక్షణ దీపిక" అను ఛందశ్శాస్త్రమును వ్రాసెను. ద్విపదలు తెలుఁగు బాసకు మేలి సొమ్ములు.

తలఁదెంపు = తలను నరుకు, తెంపు = ధైర్యము, దలకొనన్ = కలుగఁగా, జలజ + అక్షి = కమలములవంటి కన్నులుగల చంద్రమతి, అమర్చి= సవరించి, ప్రాణ + ఈశుడు = ప్రాణములకు అధిపతి (భర్త), వలగొని = చుట్టుతిరిగి, ఎరగి= నమస్కారముచేసి, పాణి + పల్లవములు = చిగురువంటి, చేతులను, మొగిచి = జోడించి. 1

అనుదిన + రక్త + పంక + అరుణంబు = ప్రతిదినము నెత్తురు బురదచే ఎఱ్ఱనైనది, జేవురుగట్టు = ఎఱ్ఱకొండ.

చందమునన్ = విధమున, వధ్య + శిల + ఉపరి + స్థలి = చంపుటకు ఏర్పరచిన రాతి పైభాగము, చెన్ను + అరి = అందముగా ఉండి, సెలవిన్ = పెదవిమూలలో.

పద్మాసనము = పూజచేయునపుడు భక్తితో కూర్చుండు పద్ధతిలో, పద్మినీ + వల్లభుపై = సూర్యునిమీఁద, చూడ్కి = చూపు, లోక + లోచన = లోకమునకు కన్నువంటి వాఁడా, సర్వ + లోక + ఏకవంద్య = అన్ని లోకములకు ముఖ్యముగా మ్రొక్కతగినవాఁడా!

సతత + పుణ్యుని = ఎప్పుడు పుణ్యము చేయువానిని, భూ + విభుని= రాజును, పార్థివ + ఈశ్వరుని = రాజులకు రాజైన వానిని (చక్రవర్తిని), పార్థివుడు (వ్యు: పృథివికి రాజు), దీపింపన్ = ప్రకాశించునట్లు, తెఱఁగున = విధముగా.

నెల + కొను = నెక్కొను = స్థిరముకాఁగా, వేఁడి = ప్రార్థించి, తలఁపు= ఆలోచన, ఒండు = మరొక, బంధంబులు = కట్లు, ఊడ్చి = విడిచి, నర + ఇంద్రుఁడు = రాజు, జగత్ + ఆశ్చర్యము = ప్రపంచమునకు వింత.

శాత + ధారా + అభీల + చటుల + ఖడ్గంబున్ = పదునైన అంచుచేత భయంకరమై చలించు కత్తిని, భూతముల్ = ప్రాణులు, భీతిల్లన్ = భయపడునట్లు, ముష్టిన్ = పిడికిటితో, ఝుళిపించి = తళతళలాడించి, జీవిత+ ఈశ్వరి = జీవితమునకు నాయిక (భార్య), మోపి = ఉంచి, కలఁగక = దుఃఖింపక, గమకించు నంత = పూనునంతలో. 6

క్రమ్మఱన్ = మరల, ఎడ = నడుమ, చొచ్చి = దూరి, కౌశికుఁడు = విశ్వామిత్రుఁడు (వ్యు : కుశికుని వంశములో పుట్టినవాఁడు).

మనుజ + రాక్షసుఁడవు = మనుష్యుని రూపములో ఉన్న రాక్షసుఁడవు. సాధ్వి = పతివ్రత.

జన + నుత + సౌందర్య + సంశోభిత + అంగి = జనులచే పొగడఁబడు అందముచే బాగుగా ఒప్పిన అంగములు కలది - స్త్రీ, భువన + విఖ్యాతమై = లోకములో పేరుబొంది, పొలుపు = స్థైర్యము, రవి = సూర్యునియొక్క, రాజసము = దొరతనము. 9

కాడున్ = శ్మశానము. 10

అడపడే = అణచివేయడా. 11

మగువల = స్త్రీలను, తొంటి పెంపు = మునుపటి గౌరవము. 12

పదును = సమయము, తెక్కలిన్ = వంచనతో. 14

భవ + సాగరము = సంసారమను సముద్రము, దరి = ఒడ్డు. 14

వేంచేయుము = వెళ్ళుము, ఎడ = చోటు, పావన + సత్య + సంపదకు= పవిత్రమైన సత్యము అను సంపత్తునకు, అలరి = సంతోషించి. 16

ఆసల = ఆశల, (ప్ర-ఆశ, వి-ఆస), పొంకబున్ = పొందిక, అంబర వీధిన్ = ఆకాశములో, ఉవిదలు = స్త్రీలు, తార్తు = తాము 17

బహు + రత్న దీప్తులన్ = చాల రత్నముల కాంతుల చేత, భాసించు= వెలుగుచు, మహనీయ = గొప్ప, దివ్య = స్వర్గమునందలి, క్రందుగా = సందడితో, వెఱగంది = ఆశ్చర్యపడి, నెఱదెంపుమై = సంపూర్ణమైన ధైర్యముతో, ధరణీతల+ ఈశ్వరుఁడు= రాజు. 18

భిదురంబు = వజ్రాయుధము, బెడిదము = కఠినము, చదలన్ = ఆకాశమునందు, అదరులు = మిణుగురులు, వామ + అక్షి = అందమైన కన్నులు కలది (స్త్రీ), కంఠనాళము = కుత్తుకలోని నరము. 19

చెన్ను = అందము, పూబోడి = స్త్రీ (వ్యు : పూవువంటి మేనః గలది). 20

5. బుద్ధిబలము

ఈ పాఠము దూబగుంట నారాయణకవి పంచతంత్ర ప్రబంధము నుండి గ్రహింపఁబడినది.

పంచతంత్రము విష్ణుశర్మ యను పండితుఁడు సంస్కృత భాషలో వ్రాసెను. అందు మిత్రలాభము; మిత్రభేదము, సంధి, విగ్రహము. లబ్దనాశము, అసంప్రేక్ష్యకారిత్వము అను అయిదు తంత్రములు మనోహర కథారూపమున వివరింపబడి యున్నవి. ఇందలి పాత్రలు పశు పక్షి మృగాదులు. రాజనీతి లోక వ్యవహారములు ఇందు చక్కఁగా తెలుపఁబడినవి. దీనిని ప్రపంచభాషలన్నియు అనువదింపఁ జేసికొన్నవి తెలుఁగున వచనములో చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగం పంతులు గారలు వ్రాసిరి. పద్య ప్రబంధముగా దూబగుంట నారాయణ కవి రచించెను.

1. ఉగ్రవనంబు= దట్టమైన అడవి, హరి = సింహము, సర్వ సత్యగ్రహణార్థియై = అన్ని జంతువులను పట్టుకొన గోరినదై, తత్ + వ్యగ్రత= . ఆ వేగిరపాటు, తతులు = సమూహములు, అర్తిమెయిన్ = దుఃఖముతో.

2. అవధరింపు = వినుము, ఎసరేగి = విజృంభించి, చలపట్టి = పగబూని, కట్టడ = నియమము, హర్యక్షము = సింహము.

3. కోలుకాఁడు = నియమించు అధికారి, చెవులపోతు = కుందేలు.

4. శశకము = కుందేలు, నొగిలి = బాధపడి.

5. ముహూర్త మాత్రంబు = కొంతసేపు (రెండు ఘడియల కాలము).

6. ఉద్ధతి = పొగరు.

7. నభోమధ్యగతుడు = నడిమి ఆకాశమున నున్నవాఁడు.

8. అవుడు = పెదవి, కంఠీరవము = సింహము.

9. అపరాహ్ణవేళ = దినమును మూఁడు భాగములు చేయగా కడపటి భాగము.

10. కినియక = కోపపడక.

11. సారంగాది = జింకలు మొదలైన, వెంగలి = వెఱ్ఱి (తెలివిలేని).

12. క్రోధానలంబు = కోపమనెడి అగ్ని, దరికొన = మండగా.

13. ఆత్మ దేహంబు = తన శరీరమును, కూపజలాంతరమున = బావినీళ్ళలో, మౌర్ఖ్యంబు = తెలివి తక్కువదనము, కతన = వలన.

6. సహకారము

ఈ పాఠము తిక్కన సోమయాజి రచించిన తెలుగు భారతము నుండి గ్రహింపబడినది.

తిక్కన మహాకవి ఆంధ్ర మహాభారత రచయితలగు కవిత్రయమున నొకఁడుగా ప్రసిద్ధిఁబొందినాఁడు. ఆయన నెల్లూరు మనుమసిద్ధి యాస్థానము నలంకరించి యుండెను. సకలశాస్త్ర పండితుఁడు. ఈయనకు కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు అను బిరుదులు గలవు.

తిక్కనామాత్యుఁడు యజ్ఞముచేసి సోమయాజి య్యెను. ఇతని కవిత్వములో తెలుఁగు పదములు మెండు. నిర్వచనోత్తర రామాయణము, భారతమున విరాట పర్వము చివరి స్వర్గారోహణ పర్వమువరకు గల భాగము ఈయన రచనలు.

1. లాగల = బొరియలలో, మహీజము = చెట్టు, అనిశంబు = ఎల్లప్పుడు, ఉరలొడ్డి = వలవఱచి, ఎరకు = ఆహారమునకు.

2. విడుగర = విడుదల, ధొరకొన్నట = పూనుట.

3. ఉత్సంగంబున = ఒడిలో.

4. నకులము = ముంగిస.

5. ఉలూకము = గుడ్లగూబ.

6. మూషికము = ఎలుక.

7. నిద్రోహుఁడు = చెడుతలంపు లేనివాఁడు, కృతఘ్నత = మేలు మఱచుట, కృతార్థుడు = తలచినది సాధించినవాడు.

8. ఆశ్రిత రక్షణశీలు = ఆశ్రయించిన వానిని కాపాడు నడవడి కలవాఁడు.

11. కృపాణము = కత్తి, సంరంభమునన్ = తొందరతో.

12. ఓడకు = భయపడకుము, చకితాత్ముండు = భయపడిన వాఁడు, అవనిజము = చెట్టు.

7. కపోతోపాఖ్యానము

ఈ పాఠ్యభాగము తిక్కన సోమయాజి కృత ఆంధ్ర మహాభారతము నుండి గ్రహింపఁబడినది.

1. బెగ్గిలి = భయపడి, వ్శ్రోడి = ప్రవాహమును దాటి, మిఱుత = మిట్టపై, వనస్పతి = చెట్టు, జొంపమై = గుబురుగా, సెజ్జ = పడక.

2. మహీరుహకోటరము = చెట్టుతొఱ్ఱ.

3. కపోతి = ఆడుపావురము.

4. కృతకృత్యము = సార్థకము, జమునిన్ = యముని.

6. ప్రభూతపు సీతునన్ = ఎక్కువ చలిచేత.

7. విహగము = పక్షి, లుబ్ధకుఁడు = బోయవాఁడు.

9. పక్షివైరి = వేటగాఁడు.

10. ప్రోగు = కుప్ప, ఇంగలంబును = నిప్పును.

11. పులుగుల = పక్షులను, వెండియున్ = మరియు.

12. పక్షినిహతి సాధనములు = పిట్టలను చంపు పరికరములు.

13. అను మరణము = కూడ చచ్చుట.

వ్యాకరణాంశములు

అక్షర ప్రకరణము

(1) ఆంధ్రభాషకు ఏబది యాఱు వర్ణములు గలవు.

(2) అచ్చులు 16 : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ.

(3) హల్లులు 37 : క, ఖ, గ, ఘ, ఙ, చ, ౘ, ఛ, జ, ౙ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ ళ, ఱ.

(4) ఉభయములు 3 : ం, ః, ఁ, (సున్న, విసర్గ, అరసున్న).

(5) వక్రములు 4 : ఎ, ఏ, ఒ, ఓ.

(6) వక్రతమములు 2 : ఐ, ఔ.

(7) స్పర్శములు 27 : క, ఖ, గ, ఘ, ఙ, చ, ౘ, ఛ, జ, ౙ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ.

(8) అంతస్థములు 4 : య, ర, ల, వ.

(9) ఊష్మములు 4 : శ, ష, స, హ.

(10) పరుషములు 6 : క, చ, ౘ, ట, త, ప

(11) సరళములు 6 : గ, జ, ౙ, డ, ద, బ.

(12) స్థిరములు : పరుషములు, సరళములు కాని హల్లులన్ని స్థిరములు.

పద ప్రకరణము :

(1) తెనుఁగున వాడఁబడు పదములు తత్సమములు, అచ్చిక పదములు అని రెండు విధములు.

తత్సమములు :

(2) సంస్కృత ప్రాకృత సమమగు భాష తత్సమము, (సంస్కృత ప్రాకృత భాషల యందలి ప్రకృతులకు

తెలుగు విభక్తులు చేర్చి ఉపయోగింపఁబడు పదములు తత్సమములు).

ఉదా : రామః (సం) రాముఁడు (తత్స) సీతా (సం) సీత (తత్స) కారో (ప్రా) కారము (తత్స), జమో (ప్రా) జముఁడు (తత్స).

(3) ఋ, ౠ, ః, ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ, జ, శ, ష, హ, అను అక్షరములున్న పదములు తత్సమములు.

ఉదా : ఖగము, ఘంట, ఛత్రము, శరణము మొ॥

(4) ప్ర-పరా మొదలగు ఉపసర్గలుకల పదములును, య, చై, జై అనునవి మొదటఁగల పదములును, రెంటికి మించిన హల్లులు సంయుక్తములైనట్టి అక్షరములున్న పదములును. స్థిరములకు ముందునను ఉండు పదములును తత్సమములు.

ఉదా : ప్రకటన, పరాక్రమము, యాచకుఁడు, చైత్రము, జైత్రుఁడు, వస్త్రము, సింహము, కింశుకము మొదలైనవి.

(5) అచ్ఛికములు మూఁడు విధములు తద్భవములు, దేశ్యములు, గ్రామ్యములు అనునవి.

తద్భవములు :

(6) శాస్త్రీయమైన మార్పులతో తెలుఁగున వాడఁబడు సంస్కృత ప్రాకృత శబ్దములు తద్భవములు.

ఉదా : భాషా (సం) బాస (తద్భ) స్నేహము (సం) నెయ్యము (తద్భ) యోధః (సం) జోదు (తద్భ) వణ్ణాన (ప్రా) పనస (తద్భ)

(7) తద్భవములకే వైకృతములను మరియొక పేరు. వికృతి చెందినవి వైకృతములు.

(8) మహాకవులు ప్రయోగించిన వైకృతములనే వాడవలెను.

దేశ్యములు :

(9) తెలుఁగు దేశమున వ్యవహారములో ఉన్న భాష దేశ్యము.
ఉదా : ఊరు, పేరు, తల్లి, తండ్రి, పాడి, పంట, ఆలు మొ॥నవి.

(10) ఇంగ్లీషు, హిందీ మొదలయిన ఇతర భాషలనుండి గ్రహించి వాడుకొను పదములు అన్యదేశ్యములనబడును. ఉదా : అసలు, జవాబు, కలము, మోటారు, రోడ్డు మొ॥

గ్రామ్యములు :

(11) లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యము.
ఉదా : వస్తాడు, పోతాడు, వచ్చేవి, పొయ్యేవి మొ॥

(12) పూర్వ కవులు తమ గ్రంథములలో వాడిన పదములు అనింద్య గ్రామ్యములు. అట్టివానిని గ్రంథములలో వాడవచ్చును.
ఉదా : కఱకంఠుడు, ప్రాణ గొడ్డము, జీవగఱ్ఱ, కపిలగడ్డము, దినవెచ్చము, కపిలజడలు మొ॥

భాషా భాగములు :

(13) తెలుఁగు భాషలోని పదములు అయిదు విధములు. నామవాచకములు, సర్వనామములు, విశేషణములు, క్రియలు, అవ్యయములు అని.

నామవాచకములు :

(14) మనుష్య, నగర, పర్వత, పక్షి, జంతు, వృక్ష, వస్తువుల పేర్లను తెలుపు పదములు నామవాచకములు.
ఉదా : రాముడు, హైదరాబాదు, గోదావరి, హిమాలయము, చిలుక, ఆవు, మామిడి, పుస్తకము మొ॥

(15) అవి జాతి, సంజ్ఞ, గుణ, సమూహ, భావ, క్రియా నామ వాచకములని ఆరు విధములు.

(16) ఒక్కొక్క జాతిని తెలుపునవి జాతి నామవాచకములు.

ఉదా : మానవుఁడు, మృగము, నది, పట్టణము మొ॥

(17) మనుష్యాదుల యొక్క నామములు ప్రత్యేకంగా తెలుపునది సంజ్ఞా నామవాచకము.

ఉదా : రాముఁడు, గంగ, ఏనుఁగు, కర్నూలు మొ॥

(18) గుణములను తెలుపునది గుణనామవాచకము.

ఉదా : నలుపు, తీపి,మొ॥

(19) సమూహమును తెలుపునది సమూహ నామవాచకము.

ఉదా : మంద, దండు, గుంపు మొ॥

(20) ఒక వస్తువుయొక్క, ప్రాణియొక్క భావమును తెలుపునది భావ నామవాచకము.

ఉదా : పొట్టి, సౌందర్యము, మంచితనము మొ॥

(21) క్రియలనుండి పుట్టినది క్రియా నామవాచకము.

ఉదా : వ్రాఁత, నేఁత, మేఁత మొ॥

సర్వనామములు :

(22) నామవాచకములకు బదులుగ ఉపయోగింపఁబడు పదములు సర్వనామములు.

ఉదా : నేను, నీవు, అది, ఆమె, వారు, ఎవరు, ఏది, ఏమి మొ॥

(23) సంఖ్యను తెలుపునది సంఖ్యావాచక సర్వనామము.

ఉదా : ఒకటి, పది, నూరు మొ॥

విశేషణములు :

(24) నామవాచకములు, సర్వనామముల గుణములను తెలియఁజేయు పదములు విశేషణము లనబడును.

(25) అవి గుణవాచక, క్రియా, సంఖ్యా విశేషణములని మూఁడు విధములు.

(26) గుణ విశేషణమును తెలుపునది గుణవాచక విశేషణము.

ఉదా : పుల్లని పండు, క్రూర జంతువు.

(27) క్రియల గుణమును తెలుపునది క్రియా విశేషణము.

ఉదా : వేగముగా పరుగెత్తును, చక్కగా పాడెను.

(28) క్రియలనుండి పుట్టిన విశేషణము క్రియాజన్య విశేషణము.

ఉదా : తినుచున్న బాలిక, పోవుచున్న బాలుఁడు

(29) సంఖ్యను తెలుపునది సంఖ్యా విశేషణము.

ఉదా : ముగ్గురు బిడ్డలు, రెండు కన్నులు.

(30) ఒక్కొక్కసారి నామవాచకములే విశేషములగును.

అట్టివానిని "నామవాచక విశేషణము" లందురు.

ఉదా : గంగానది; నలచక్రవర్తి; గోలకొండ పట్టణము.

క్రియలు :

(31) నామవాచకాదులు చేయు పనులను తెలుపునవి క్రియలనబడును.

(32) క్రియలు సమాపకములు, అసమాపకములు అని రెండు విధములు.

(33) వాక్యార్థమును పూర్తిచేయునది సమాపక క్రియ.

ఉదా : రాముడు సీతను పెండ్లాడెను; పిల్లి పాలు త్రాగెను.

(34) వాక్యార్థము పూర్తిచేయనిది అసమాపక క్రియ

ఉదా : రంగడు బడికిపోయి మొ॥

(35) కర్తలను బట్టి క్రియలకు ఉత్తమ; మధ్యమ; ప్రథమలని మూఁడు పురుషములు కలవు.

(36) తన్నుగూర్చి చెప్పునది ఉత్తమ పురుషము; ఎదుటి వానిని గూర్చి తెలుపునది మధ్యమ పురుషము; ఇతరుని గూర్చి తెలుపునది ప్రథమ పురుషము అనఁబడును.

	ఏకవచనము	బహువచనము
ఉదా : ఉత్తమ పురుషము	చూచితిని	చూచితిమి
మధ్యమ పురుషము	చూచితివి	చూచితిరి
ప్రథమ పురుషము	చూచెను	చూచిరి

(37) భూత; వర్తమాన; భవిష్యత్, తద్ధర్మములని కాలములు నాలుగు విధములు.

(38) జరిగిపోయినదానిని తెలుపునది భూతకాలము.

ఉదా : చదివెను, తినెను.

(39) జరుగుతున్న దానిని తెలుపునది వర్తమానకాలము.

ఉదా : చదువుచున్నాఁడు; తినుచున్నాఁడు.

(40) ముందు జరుగబోవు దానిని తెలుపునది భవిష్యత్ కాలము.

ఉదా : చదువగలఁడు, తినగలఁడు.

(41) పై మూఁడు కాలములందును ఒకటిగా నుండు స్వభావమును తెలుపునది తద్ధర్మకాలము.

ఉదా : చదువును; తినును.

అవ్యయములు :

(42) ఏ విధమైన మార్పు పొందని పదములు అవ్యయములనఁబడును. వానికి లింగ, వచన, విభక్తి, పురుషలుండవు.

(43) అవి లాక్షిణికములు, ప్రతి పదోక్తములు అని రెండు విధములు.

(44) లక్షణముచే సిద్ధమైన అవ్యయములు లాక్షిణికములు (అసమాపక క్రియలు అవ్యయములగును)
ఉదా - తిని, తినక, వెళ్ళి, వెళ్ళక మొ॥

లింగములు :

(46) స్త్రీ పురుష జడ భేదములు దెలుపునది లింగము.

(47) సంస్కృతము నందువలె లింగము శబ్దమునాశ్రయింపక తెలుఁగున నర్థము నాశ్రయించి యుండును.

(48) ఆంధ్రమునందు లింగములకు వాచకములని పేరు. అవిమహ ద్వాచకము, మహతీవాచకము, అమహిద్వాచకము అనఁబడును.

(49) మగవారిని దెలుపు పదములును, వాని విశేషణమును మహద్వా చకములు. ఉదా॥ పోతన, సేనాని, కవి మొ॥

(50) స్త్రీ జాతిని దెలుపు పదములును, వాని విశేషణములును మహతీ వాచకములు ఉ॥ సీత, కన్యక మొ॥

(51) జంతువులు, జడములు మొదలైనవానిని దెలుపు పదములు అమహద్వాచకములు.

ఉదా ॥ భారతము, బాణములు, రాజధాని మొ॥

వచనములు :

(52) ఒకటికిని, ఒకటికంటె నెక్కువకును గల భేదమును తెలుపునది వచనమనఁబడును. ఏకవచనము, బహువచనము అని రెండు భేదములు కలవు.

(53) ఒక దానిని దెలుపునది ఏకవచనము. ఉదా ॥ రాముడు, స్త్రీ మొ॥

(54) అనేకములను దెలుపునది బహువచనము.

(55) సామాన్యముగా ఏకవచన రూపము చివర "లు" చేర్చుట వలన బహువచన మేర్పడును.

(56) కొన్ని పదములకు బహువచనము నందనేక రూపములు గలవు. ఉదా॥ మ్రాను + లు = మ్రాకులు, కొలను + లు = కొలనులు, ఆవు + లు = ఆవులు, ఆలు, అల్లుడు + లు = అల్లురు, కాలు + లు = కాళ్ళు, గోరు + లు = గోళ్ళు, వేఁటకాఁడు + లు = వేటకాఁడ్రు, వేటకాఱులు, ఆలు + లు = ఆండ్రు, త్రాడు + లు= తాడులు, త్రాళ్లు, పెండ్లి + లు = పెండ్లిండ్లు మొ॥

(57) కొన్ని పదములకు బహువచనము లేదు. ఉదా॥ పైడి, వెండి, కేలు, మొన్న, రేపు, మాపు మొ॥

(58) కొన్నిటికి ఏకవచనము లేదు. ఉదా॥ ఇతరులు, కురులు, వడ్లు, పెసలు మొ॥

విభక్తులు :

(59) వాక్యములోని పదములయొక్క సంబంధములు దెలుపునది విభక్తి యనఁబడును. వీనికే విభక్తి ప్రత్యయములని పేరు. ఇవి యేడు విధములు.

సంబోధన ప్రథమా విభక్తి మరొకటి కలదు.

డు-ము-వు-లు	ప్రథమావిభక్తి
నిన్-నున్ – లన్ - కూర్చి - గురించి	ద్వితీయావిభక్తి
చేతన్ - చేన్ - తోడన్ - తోన్	తృతీయావిభక్తి
కై- కొఱకున్	చతుర్థీవిభక్తి
వలనన్ - కంటెన్ - పట్టి - నుండి	పంచమీవిభక్తి
కిన్-కున్ - యొక్క- లోన్ - లోపలన్	షష్ఠీవిభక్తి
అందున్ - నన్	సప్తమీవిభక్తి
ఓ - ఓరీ - ఓయీ - ఓసీ	సంబోధన ప్రథమావిభక్తి

ఔపవిభక్తికములు :

(60) విభక్తులకు సాయముగా వచ్చు "ఇ-టి-ంటి-తి" అనునవి ఔపవిభక్తికములనబడును.

(61) ఇవి ద్వితీయా ద్యేకవచనములు పరమగునపుడు కొన్నింటికి ఆగమములుగను కొన్నింటికి ఆదేశములుగను; కొన్నింటికి పర్యాయమున రెండు విధములుగ తఱచుగ వచ్చును.

ఉదా : కాలు + నిన్ = కాలినన్ (ఇ) త్రాడు + తోన్ = త్రాటి తోన్ (టి) ఇలు + నిన్ = ఇంటినిన్ (ంటి) చేయి + నిన్ = చేతినిన్ (తి) రెండు + నిన్ = రెంటినిన్ (టి-ఆదేశముగ వచ్చినది) రెండు + నిన్ = రెండింటిన్ = (అగమము)

సంధులు :

(62) అచ్చునకు అచ్చు పరమైనపుడు పూర్వమందున్న అచ్చు పోయి పరమందున్న అచ్చుచేరుట సంధియనఁబడును.

(63) స్త్రీ వాచకములయు, తత్సమ శబ్దములయు, సంబోధన, ములయు; నిశ్చయార్థకములయు "ఆ" అకారమునకు సంధి రాదు.

(64) సంధి లేనిచోట స్వరంబు కంటెఁబరమై స్వరంబునకు యడాగమంబగు. (య్ ఆగమముగ వచ్చును) ఉదా :- అమ్మ + ఇచ్చెను= ఆమ్మయిచ్చెను; హంస + ఏది = హంసయేది; రాముఁడ + ఇటు= రాముఁడ యిటు; (ఆతండ + అర్జునుడు = అతండ యర్జునుఁడు)

అచ్చంధులు :

(65) అత్తునకు సంధి బహుళము (బహుళమనగా కొన్ని చోట్ల వచ్చుట, కొన్ని చోట్ల రాకుండుట. కొన్నిచోట్ల నొకమాఱు వచ్చి మఱియొకమాఱు రాకుండుట) ఉదా: రామ + అయ్య = రామయ్య ; పాప + ఎచట = పాపయెచట; మేన + అల్లుడు = మేనయల్లుడు.

(66) అన్నాదులు పరమగునపుడు నామవాచకముల యొక్క మధ్యమ పురుష యొక్క ఇకారమునకు సంధి నిత్యము. ఉదా :- దాసరి + అన్న = దాసరన్న; జానకి + అమ్మ = జానకమ్మ; వచ్చితివి + ఇపుడు = వచ్చితివిపుడు, వచ్చితిపుడు.

(67) ఏమ్యాదుల యొక్క ప్రథమ, ఉత్తమ పురుష క్రియల యొక్క ఇకారమునకు సంధి వైకల్పికము. ఉదా : ఏమి + అంటివి = ఏమంటివి - ఏమియంటివి; అది + ఎట్లు = అదెట్లు, అదియెట్లు, వచ్చిరి + అమరులు = వచ్చిరమరులు,

వచ్చిరియమరులు, చేసితిమి + ఇపుడు = చేసితిమిపుడు, చేసితిమి యిపుడు.

(68) క్త్వార్థకముల యొక్క, తత్సమముల యొక్క "ఇ" కారములకు సంధిరాదు. ఉదా॥ చేసి+అనెను = చేసియనెను; కవి+అతఁడు = కవియతఁడు (కవతఁడు అనరాదు).

(69) ఉత్తునకు అచ్చు పరంబగునపుడు సంధి నిత్యము. ఉదా॥ దానవుఁడు + ఎవ్వఁడో = దానవుఁడెవ్వఁడు; వారు + ఉండరు = వారుండరు; బాగు + అగు = బాగగు.

(70) ప్రథమేతర విభక్తులయొక్క, శత్రర్థక. చువర్ణకము 'ఉ' కారమునకు అచ్చు పరంబైనపుడు సంధి వైకల్పికము. ఉదా॥ నన్నున్+అడిగె = నన్నడిగె, నన్నునడిగె; నాకొఱకున్+అడిగె = నాకొఱకడిగె, నాకొఱకునడిగె; నాకున్ + ఇచ్చె = నాకిచ్చె, నాకునిచ్చె; వానియందు + అట్టి = వానియందట్టి - వానియందునట్టి, చూచుచున్ + ఏగెను= చూచుచునేఁగెను - చూచుచేఁగెను.

త్రికసంధి :

(71) అసంయుక్తములైన కొన్ని హల్లులు పరమగునపుడు "ఆ-ఈ-ఏ" అనువానికి హ్రస్వమును పరమైన హల్లునకు ద్విత్వమును వైకల్పికముగనగును. (త్రికమనఁగా ఆ, ఈ, ఏ అనునవి) ఉదా॥ ఆ+చోటు = అచ్చోటు, ఆచోటు; ఈ + జగము = ఇజ్జగము, ఈ జగము; ఏ + కడ = ఎక్కడ, ఏకడ.

(72) త్రికమునకు "శ- ష- స- హ- ర" అనునవి పరమగునపుడు సంధిరాదు. ఉ॥ ఆ + శబ్దము = ఆ శబ్దము; ఈ +

షండుడు = ఈషండుడు; ఈ + సంగతి = ఈసంగతి; ఏ + హయము = ఏహయము; ఈ + రమణి = ఈరమణి

హల్సంధులు :

(73) ప్రథమ మీఁదనుఁకళలైన అవ్యయములమీఁదను కళలగు క్రియా పదముల మీఁదను ఉండు "క - చ - ట - త - ప"లకు "గ - జ - డ - ద - వ"లు వైకల్పికముగ ఆదేశములగును. ఉదా॥ గుణంబు+ కలిగిన = గుణంబు గలిగిన, గుణంబు కలిగిన; అట్లు + తలఁచె= అట్లు దలఁచె, అట్లు తలఁచె, ఎఱుంగమి + పెట్టరె = ఎఱుంగమి వెట్టరె, ఎఱుంగమి పెట్టరె.

(74) కళలగు తెలుఁగు పదములమీఁది దత్సమ పరుషములకును, నిశ్చయార్థక, క్త్వార్థక, సంభోధనలమీఁది పరుషములకును "గ-స-డ-ద-వ-లు" తఱచుగరావు ఉదా॥ అది + తథ్యము = అదితథ్యము; తాను + చనియెన్ = తానచనియెన్; చూచి + తగినట్లు = చూచితగినట్లు; తల్లీ + కాపాడుము = తల్లీ! కాపాడుము.

ద్రుత ప్రకృతికములు - కళలు:

(75) ఆంధ్రమందలి పదములు ద్రుత ప్రకృతికములు, కళలు అని రెండు విధములు (ద్రుతమనఁగా నకారము).

(76) ద్రుతము అంతమందుడునది ద్రుత ప్రకృతకము, అది లేనిదికళ

(77) ద్రుతాంతములు: ప్రథమావిభక్తి, కై, పట్టి - యొక్క ప్రత్యయములు తప్ప తక్కినవన్నియు ద్రుతాంతములు.

సర్వనామములలో :

నేను, తాను, అను ప్రథమా విభక్తులును :

అవ్యయములలో :

అంతన్, అంతటన్, అయ్యున్, అవలన్, ఇంకన్, ఎడలన్, కడున్, కానన్, కూడన్, క్రిందన్, చాలన్, చోన్, తప్పన్, తరువాతన్, దాఁకన్, పగిదిన్, పయిన్, పిదపన్, పోలెన్, మఱలన్, మాడ్కిన్, మిగులన్, మీఁదన్, రీతిన్, వలెన్, వఱకున్, మొదలయిన అంతాదులును.

సముచ్చయములు :

ఉదా॥ రాముఁడు+ఉన్ = రాముఁడున్

అసమాపక క్రియలలో :

వ్రాయుచున్, వ్రాయుడున్, వ్రాయున్, వ్రాసినన్, మొదలైనవియును.

సమాపక క్రియలలో :

ని - ను - అంతమందుగల క్రియలు - రక్షించుతన్, కావుతన్ మొదలైనవియును ద్రుత ప్రకృతికములు.

కళలు :

(78) ద్రుతము అంతమందులేని పదములు కళలు. విభక్తి, ప్రత్యయములలో డు, ము, వు, లు, కై, పట్టి, నుండి, యొక్క ప్రత్యయములు కళలు, సంబోధనలు గూడ ప్రథమా విభక్తిలో జేరును.

అంతాదులుగాని అవ్యయములును (అక్కట, ఆహా, ఔరా, భళీ, అట్లు, ఇట్లు, అట, ఏల, ఊరక, మిన్నక ఇదిగో, మొదలైనవి) అసమాపక క్రియలలో అని, విని, చదివి అనక, వినక, చదువక, చూడక, మొదలైనవియును కళలు.

(79) ద్రుత ప్రకృతికముల మీఁది క, చ, ట, త, ప లకు క్రమంగా గ, జ, డ, ద, బ లు ఆదేశమగును.

(80) ఆదేశమైన "గ జ డ ద బ"లకు ముందున్న ద్రుతములకు ఖండబిందు. పూర్ణబిందు, స్వత్వ సంశ్లేషములు విభాషనగు.
ఉదా : విచ్చెన్ + కమలము = విచ్చెగమలము, విచ్చెంగమలము, విచ్చెను గమలము, మొద॥ (విచ్చెన్ గమలము అనియు వ్రాయవచ్చును).

సంస్కృత సంధులు :

(81) సవర్ణదీర్ఘసంధి - హ్రస్వ దీర్ఘములకు అ, ఇ, ఉ, ఋ లకు మరలనవియే పరమైనచో దీర్ఘము ఆదేశమగును, ఉదా॥ వనజ + అక్షుడు = వనజాక్షుడు, ముని + ఇంద్రుఁడు = మునీంద్రుఁడు; రఘు + ఉత్తముడు = రఘూత్తముడు; పితృ + ఋణము = పితౄణము మొ॥.

గుణసంధి :

(82) అ, ఆ లకు హ్రస్వదీర్ఘములకు "ఇ, ఉ, ఋ, లు పరమైన" ఏ, ఓ, అర్‌లు ఆదేశమగును.
ఉదా : నర + ఇంద్ర = నరేంద్ర, సూర్య + ఉదయము = సూర్యోదయము, మహా + ఋషి = మహర్షి మొ॥

వృద్ధిసంధి :

(83) అకారమునకు "ఏ, ఐ, ఓ, ఔ"లు పరమైన ఐ, ఔలగును. ఉదా : కుల + ఏక = కులైక; మహా + ఐశ్వర్యము = మహైశ్వర్యము: నాక + ఓకస్సు = నాకౌకస్సు; గంధక + ఔషధము = గంధ కౌషధము మొదలగునవి.

యణాదేశసంధి :

(84) "ఇ, ఉ, ఋ"లకు సవర్ణములు కాని అచ్చులు పరములై "య, వ, ర" వర్ణములగును.

ఉదా : ప్రతి + ఉత్తరము = ప్రత్యుత్తరము; గురు + అంశ = గుర్వంశ, పితృ + ఆజ్ఞ = పిత్రాజ్ఞ.

వాక్య ప్రకరణము :

(1) పరిపూర్ణమైన అర్థమును బోధించు ఒక పదముగాని, కొన్ని పదముల కూడికగాని "వాక్య"మనఁబడును.

ఉదా : పో, నిలువుము, పక్షులెగురును.

(2) వాక్యము లాక్షణికముగ సామాన్య, సంశ్లిష్ట, మహా వాక్యములని మూఁడు విధములు.

(3) ఒక సమాపక క్రియతోఁ గూడి యుండినది సామాన్య వాక్యము.

ఉదా : ఇచట సుఖనిద్ర పొందితిని.

(4) ప్రధాన వాక్యమును, దానికి కారణభూతమైన యప్రధాన వాక్యమును కలిసి "సంశ్లిష్ట" వాక్యమగును.

ఉదా : తిక్కన భారత రచన వ్యాజమున ఆనాటి తెలుంగుల సాహసములను చాటెను.

(5) అసంపూర్ణములు, అవాంతరములు, సంపూర్ణములు, నగు కొన్ని వాక్యముల కూడిక "మహావాక్య"బనబడును.

ఉదా : రాయంచ కన్నీరొలుక బలికిన, నృపాలుండు, కృపాళుండు హస్తపల్లవంబు వదిలి 'రాజమంసంబ, పొమ్ము సుకంబుండుము' అని విడిచిపుచ్చె.

సమాసములు :

(6) వేఱు వేరర్థములు గల పదములు రెండింటినిగాని, ఎక్కువను గాని ఒక యర్థము వచ్చునట్లు ఒకటిగా జేర్చినచో సమాసమనబడును.

ఉదా : దిన + రాజు = దినరాజు.

(7) పదముల సంబంధమును దెలిపెడి విభక్తులు లోపింపని పద సమూహము విగ్రహమనబడును.

ఉదా : దినమునకు రాజు, విగ్రహము సమాసార్థమును వివరించును.

(8) సమాసములారు విధములు. తత్పురుషము, కర్మధారయము, ద్విగువు, బహువ్రీహి, ద్వంద్వము, అవ్యయీ భావము అనునవి.

తత్పురుషము :

(9) రెండవ పదముయొక్క అర్థము ప్రధానముగా గలది తత్పురుషము.

(10) ప్రథమాది విభక్తి ప్రత్యయములు గల పదములు మీది పదములతో సమసించుటచే యేడు తత్పురుష భేదములగును. విగ్రహమున మొదటి పదమునకే విభక్తి యుండునో ఆ తత్పురుషమగును.

ఉదా : ప్రథమా తత్పురుషము		(నకు) పూర్వ(ము) కాయము
ద్వితీయా	త -	నెల(ను) తాల్పు
తృ-	త -	విద్యా(చేత) నిపుణుడు
చ-	త -	ధనాశ (కొరకు) ఆశ
పంచమి-	త -	దొంగ (వలని) భయము
షష్ఠి-	త -	రాముని (యొక్క) దయ
సప్తమి-	త -	పతి (యందు) భక్తి

(11) అ, అన్, అనునవి సమాసము మొదట నుండి వ్యతిరేకార్థమును బోధించిన "నఞ్ తత్పురుష" మగును.

ఉదా : అసాధ్యుడు అనుచితము

(12) విభక్తులు లోపింపని సమాసము "అలుక్సమాసము"

ఉదా : నీతోడి చెలిమి, పంకేజము.

కర్మధారయము :

(13) విశేషము విశేష్యముతో గలియుట కర్మధారయమనబడును.

ఉదా : తెల్లగుఱ్ఱము, మంచిబాలుఁడు.

(14) కర్మధారయమున లోపింపని ప్రథమా విభక్తి ప్రత్యయమగు "ము" వర్ణమునకు "పు.ంపు" అనునవి ఆదేశములగును.

ఉదా : సరసము + మాట = సరసపుమాట, సరసంపుమాట.

(15) కర్మధారయసమాస మెనిమిది విధములు.

ఉదా : విశేషణ పూర్వపదము. లేఁఇచ్చిక, పరమభాగవతులు

విశేషణోత్తర పదము- మృగధూర్తము

విశేషణోభయ పదము- మృదుమధురము

ఉపమానపూర్వ పదము- తేనెమాటలు

ఉపమానోత్తర పదము- పాదపద్మములు

సంభావనాపూర్వపదము - లంకాద్వీపము

అవధారణాపూర్వ పదము - విద్యాధనము-

ముఖ చంద్రుఁడు

మధ్యమ పదలోప కర్మధారయము- ఛాయాతరువుఁ

వంటకుండలుఁ

బహువ్రీహి :

(16) సమాసమందలి పదము చివర "కలవాడు, కలది" అను అర్థము వచ్చుచుండునది బహువ్రీహి సమాసము.

ఉదా : శుష్కజలము (ఎండిపోయిన నీరు కలది) పీతాంబరుడు (పసుపచ్చని వస్త్రము కలవాడు)

ద్వంద్వ సమాసము :

(17) ఉభయ పదార్థ ప్రధానము ద్వంద్వము.

ఉదా : రామలక్ష్మణులు, కూరగాయలు, ధర్మజ, భీమార్జున నకుల సహదేవులు.

ద్విగువు :

సంఖ్యాపూర్వకము ద్విగువు.

(18) ఉదా : త్రిమూర్తులు, ముల్లోకములు.

(19) మొదటి పదము అవ్యయమై దాని యర్థము ప్రధానమైనది అవ్యయీభావము.

ఉదా : నిర్జనము, కడు దూరము.

(20) భిన్న సమాస రూప పదములనేక శేషము ఏకశేష సమాసమనబడ...

ఉదా : (మాత + పిత) = పితలు, (రాముడు + రాముడు) = రాములు.

పదదోష ప్రకరణము :

(1) తెలుగు పదముల మొదట (య, వు, వూ, వొ, వో, ఞ, ళ)లు ఉండరాదు.

ఉదా : యంత, వుప్పు, వొకటి, వోర మొదలగునవి.

(2) ప్రథమా విభక్తి "ము" వర్ణమును బిందువుగా వ్రాయుట.

ఉదా : కలం, ఫలం, వనం, మనం.

(3) ఒత్తులు తాఱుమాఱుచేయుట.

ఉదా : భాద, బేధము, భోద.

(4) ధాతువులోని యకారమునకు సకారము వ్రాయుట.

ఉదా : వ్రాసుట, కోసుట.

(5) ప్రార్థనార్థకములను వ్యతిరేకార్థములుగా వ్రాయుట.

ఉదా : చేయమనియె, (చేయుమనియె-ఒప్పు) (తినమనియె, తినుమనియె ఒప్పు).

(6) లఘురేఫ ద్విత్వమును వాడుట.

ఉదా : గుర్రము, కర్రి, మర్రి.

(7) "అ" కార "ఎ" కారములను తాఱుమాఱు చేయుట.

ఉదా : చెరిత్ర (చరిత్ర-ఒప్పు) కొంచము (కొంచెము- ఒప్పు).

(8) "శ, ష, స" లను తాఱుమాఱు చేయుట.

ఉదా : సిరసు, ఇస్టము.

(9) వట్రుసుడి తప్పు చేయుట. ఉదా : క్రుప (కృప) కౄరము (క్రూరము) సంస్కౄతము (సంస్కృతము).

(10) ఔప విభక్తికములను పాటింపకుండుట.

ఉదా :నేయికై, గోయిలో

(11) కొని కి "క" వ్రాయుట.

ఉదా : పట్టుక (పట్టుకొని - ఒప్పు) తీసుక.

(12) సర్వనామములు తప్పుగా వ్రాయుట.

ఉదా : అతను, వాటిని (వానిని - ఒప్పు).

(13) స్ఫుటమైె ఉచ్ఛారణను గ్రహింపలేకుండుట.

ఉదా : గ్రంధము (గ్రంథము), ప్రధమ (ప్రథమ), ఆగ్న, గ్నానము (ఆజ్ఞ, జ్ఞానము), ఇట్టి దోషములు చేయరాదు.

వాక్య దోషములు :

(14) ఉకారాంతముపై యడాగమము సేయుట.

ఉదా : వాడు యేగెను.

(15) ద్రుత ప్రకృతకముమీద యడాగమము.

ఉదా : వచ్చె యతడు.

(16) కళలమీద నకారాగమము. ఉదా : ఏలనన, పోకనుండెను.

(17) క్వ్యార్థక ఇకార సంధి. ఉదా : తెచ్చిచ్చెను, చేనడిగెను.

(18) పునరుక్తి దోషము. ఉదా : హిమాచల పర్వతము.

(19) లింగవచనములను తప్పుగా వ్రాయుట.

ఉదా : స్త్రీలు కడుశూరులు, బలిష్ఠమగు గుఱ్ఱాలు.

(20) కేవల సంస్కృత పదములను తెలుఁగు పదములతో సమసింపఁ జేయుట.

ఉదా : పంచరంగులు, దురలవాటు.

విరామ సంజ్ఞలు :

(.) భావము సులభముగ బోధపడుట వాక్యాదుల చివర తగిన విధముగ విరామ సంజ్ఞల నుపయోగింపవలెను.

(,) విరామ చిహ్నము-అన్వయము నందు సమీప సంబంధము కలిగియు నించుక సేపు నిలువవలసిన చోట నీ గురుతును వాడవలెను.

ఉదా : సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ఆకాశమునలంకరించును.

(;) అర్థబిందువు-సమాపక క్రియల సంబంధమునకు నిలుపునపుడు వాడవలెను.

ఉదా : నీటియందు బెండ్లు తేలును; కాని గుండ్లు తేలవు.

(.) బిందువు - సంపూర్ణ వాక్యము చివర ఈ గుర్తును వాడవలెను.

ఉదా : పాపమునకు భయపడును

(?) ప్రశ్నార్థకము : ప్రశ్నార్థక వాక్యము చివర నీ గుర్తు నుపయోగింపవలెను. ఉదా : ఎవరక్కడ ?

(!) రాగచిహ్నము - ఆశ్చర్యము, దుఃఖము మొదలగు వానిని తెలుపు పదముల వాక్యముల చివర నీ గుర్తు వాడవలెను.

ఉదా : ఇవి యేటి మాటలు!, అయ్యో!, ఎంత మంచివాడు!

(" ") అనువాద చిహ్నము- ఇతరుల మాటలను, సామెతలను తెలుపు నపుడు వానికిరుప్రక్కల నీ గుర్తులుండవలెను.

ఉదా : "జీవన్ భద్రాణి పశ్యతి" అన వినవే.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచుర

1. ఆంధ్ర మహాభారతోపన్యాసములు............ రూ. 100/-
2. తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్ష ృత్త్వం . రూ. 70/-
3. తెనుగు సాహితి .... రూ. 36/-
4. స్త్రీల రామాయణపు పాటలు .... రూ. 36/-
5. సమీక్షణం .... రూ. 36/-
6. పరిణతవాణి - 1,2,3,4, 5 సంపుటాలు................. రూ. 266/-
7. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు .... రూ. 70/-
8. ఇదివెంటి వ్యాసాలు .... రూ. 30/-
9. శాలివాహన గాథా సప్తశతీసారము .... రూ. 15/-
10. రాయప్రోలు రచనలు - తత్వవివేచన .... రూ. 60/-
11. తెలుగులో సాహిత్యోద్ధారకులు .... రూ. 40/-
12. మల్లికా గుచ్ఛము (కథలు).. రూ. 8/-
13. ఆంధ్ర వాఙ్మయచరిత్ర .... రూ. 85/-
14. సుమతీ, వేమన, కృష్ణ శతకాలు .... రూ. 24/-
15. ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక .... రూ. 250/-
16. తెలంగాణ జాతీయోద్యమాలు .... రూ. 10/-
17. విమర్శకవతంసులు .... రూ. 45/-
18. సాహిత్యోపన్యాసములు .... రూ. 5/-
19. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు .... రూ. 125/-
20. సాహిత్యానువాదం - సమాలోచనం .... రూ. 60/-
21. ఆధునిక తెలుగు సాహిత్యంలో హాస్యం .... రూ. 60/-
22. మన హాస్యం.. రూ. 100/-
23. శివరాత్రి మహాత్మ్యం .... రూ. 75/-
24. తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం.................................. 100/-
25. తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం 150/-
26. వ్యాసగుళుచ్ఛం మొదటి భాగం.. 80/-
27. వ్యాసగుళుచ్ఛం రెండవ భాగం 60/-